ఒడిషా రిపోర్టు

# ఎఐకెఎంకెఎస్ నాయకులు
# కా॥నిరాకర్ నాయక్ అక్రమ అరెస్టుకి వ్యతిరేకంగా నిరసన

**నవంబరు 1,** 2019న ఎఐకెఎంకెఎస్ గంజాం జిల్లా అధ్యక్షులు కా॥నిరాకర్ నాయక్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. మిగులు భూములపై ప్రజలకు గల హక్కులను గూర్చి చర్చించటానికి జిల్లా అదనపు న్యాయాధికారిని కలవటానికి వెళుతుండగా ఆయనను అరెస్టు చేశారు. బాడగడ పోలీసులు ఆయనపై తప్పుడు కేసులు బనాయించారు. ఒకటి 2011లో పెట్టబడిన తప్పుడు కేసు. ఆ ఎఫ్ఐఆర్‌లో కనీసం ఆయన పేరు కూడా లేదు. ఐపిసి 124 కింద, ఇతర సెక్షన్ల కింద, ఉపా చట్టంకింద మరో కేసును ఆయనపై బనాయించారు.

కా॥నిరాకర్ భూమిలేని దళిత నిరుపేద. ఒక దశాబ్దానికి పైగా ఒడిషాలోని గంజాం జిల్లాలోగల వివిధ బ్లాకులలోని భూమిలేని పేదప్రజలు, దళితులు, ఆదివాసీల మధ్య ఆయన చురుకుగా పనిచేస్తున్నారు. అధికారులకు విజ్ఞాపనలు ఇవ్వటానికి, ప్రజాస్వామిక నిరసన కార్యక్రమాలకు, అటవీ హక్కులు, భూములు, ఇళ్ళస్థలాల వంటి జీవనోపాధి సమస్యలపై జరిగే ప్రజాప్రదర్శనలు, ధర్నాలను నిర్వహించటంలో నిమగ్నమైయున్నారు. సిపిఐ(ఎం-ఎల్) పార్టీగా, ఎఐకెఎంకెఎస్ ప్రజాసంఘంగా ఆయన సాగించిన అంకితభావంతో కూడిన నిర్విరామ కృషి ఫలితంగా పేద ప్రజల అభిమానానికి పాత్రుడయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ (ఎం-ఎల్) పార్టీ తరపున గంజాం జిల్లాలోని సరోడా నియోజకవర్గంలో పోటీ చేశారు. ప్రజాస్వామిక శక్తులలోను, న్యాయవాదులలోనూ ప్రజాఉద్యమాలకు మద్దతు పెరుగుతూ వుంది. ఈ సమయంలో పోలీసులు ఆయనను నిర్బంధించి జైలులో పెట్టారు. ప్రజల ప్రజాస్వామిక ఉద్యమాలను చెల్లాచెదురుచేయటం, వారికి నాయకత్వాన్ని అందుబాటులో లేకుండాచేసే ప్రయత్నమే తప్ప ఇది వేరుకాదు. ఇంతకు ముందు కూడా ఆయనపై వండివార్చిన తప్పుడు కేసులు బనాయించి మూడున్నర సం॥రాలు జైలు నిర్బంధానికి గురిచేశారు. ఒడిషా హైకోర్టు నుండి బెయిలు తెచ్చుకుని ఆయన విడుదలయ్యారు. ప్రజలపై, ప్రజాస్వామిక హక్కులపై, ఉద్యమాలపై ప్రభుత్వపు దాడుల్లో భాగంగానే ఈ అప్రజాస్వామిక, అన్యాయమైన, నిర్బంధపూరిత చర్య వున్నది. ప్రజాస్వామిక శక్తులు, ప్రజానుకూలురు, న్యాయాన్ని, ధర్మాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరు ఈ నిర్బంధపూరిత చర్యను ఖండించాలి.

కా॥నిరాకర్ అరెస్టును ఖండిస్తూ నవంబరు 4, 2019న ఎఐకెఎంకెఎస్ పోలోసారా బ్లాకు కమిటీ గంజాం తహసిల్దారుకు, ఎస్‌పికి మెమోరాండం సమర్పించింది. ఆ కామ్రేడ్‌పై వున్న అన్ని తప్పుడు కేసులను ఎత్తివేయాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండు చేశారు. అదేరోజున చాషీమూలియా సంఘం, ఉపకులియ జంగల్ 'ఒ' జామి సురక్ష్య సమితి(యుజెజెఎస్ఎస్) పూరీ పట్టణంలో ఒక నిరసన ప్రదర్శన జరిపి, కా॥నిరాకర్‌పై వున్న తప్పుడు కేసులను ఎత్తివేసి వెంటనే ఆయనను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ డిప్యూటీ కలక్టరుకు మెమోరాండం సమర్పించింది.

నవంబరు 6, 2019న సిపిఐ(ఎం-ఎల్) ఒడిషా రాష్ట్రకమిటి నాయకత్వాన భువనేశ్వర్‌లోని మాస్టర్ కాంటీన్ చౌక్‌వద్ద ప్రజలు ధర్నా చేశారు. కా॥నిరాకర్ అక్రమ అరెస్టును నిరసిస్తూ సాగిన ఈ ధర్నాలో ఆయనను వెంటనే విడుదల చేయాలని, ఆయనపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ(ఎం-ఎల్) నుండి కా॥శ్రీకాంత్ మొహంతి, కా॥బసు దేవ్‌దాస్, కా॥మోహన్‌నాయుడు; యుజెజెఎస్ఎస్ నుండి కా॥బటకృష్ణస్వైన్; సిపిఐ(ఎం) నుండి కా॥సురేష్ పాణిగ్రాహి; సిపిఐ(ఎం.ఎల్) ఆర్ఎస్ నుండి కా॥శివరాం, కా॥పరిమళ; సిపిఐ (ఎం-ఎల్)లిబరేషన్ నుండి కా॥రాధాకాంత్ సేఠీ, కా॥మహేంద్ర పారిడా పాల్గొన్నారు. ఇంకా నరేంద్ర మొహంతి, ప్రొ॥బీరేన్‌నాయక్, సుధీర్ పట్నాయక్, లెనిన్, సూర్యమణి మిశ్రా, అశోక్ నందా, సమీర్‌సర్కార్, మహమ్మద్ ఖుజూర్, రాధాకాంత్ బారక్ వంటి అనేకమంది ప్రజాస్వామికవాదులు, ప్రజాస్వామికసంస్థల కార్యకర్తలు ఈ ప్రజాధర్నాలో పాల్గొన్నారు.

౦౦౦